కామినీ పిశాచి

వసుంధర

"నమస్కారం వెంకన్నగారూ!" అన్నాడా యువకుడు.

"కూర్చోండి" అన్నాడు వెంకన్న.

"ఇదివరలో మీరు నన్ను ఓ హత్యకేసు నుండి రక్షించారు. మీ దయవల్ల జైలుబాధ తప్పించుకున్న నేను ఓ యింటివాణ్ణి కాబోతున్నాను" అంటూ ఆ యువకుడు వెంకన్నకు ఓ శుభలేక అందించాడు. వెంకన్న అది అందుకుని చదువుకున్నాడు. ఆ యువకుడి పేరు జనార్దనరావు. అతని కాబోయే భార్య పేరు రాధ. వివాహానికింకా పది రోజులు వ్యవధి వుంది.

"అంటే పదిరోజుల్లో మీ అంతట మీరే జైలుకు వెడుతున్నారన్న మాట!" అన్నాడు వెంకన్న.

యువకుడు ఆశ్చర్యంగానూ, కంగారుగానూ "ఏం?" అన్నాడు.

"పెళ్ళయ్యేంతవరకే ఇల్లు ఇల్లు. ఆ తర్వాత నుంచి

అది జైలు. ఆ జైలుకు జైలరు భార్య" అని వెంకన్న ఏదో అనబోతూండగా బల్లమీద ఫోన్ మ్రోగింది.

"నేను వంటింట్లోంచి మాట్లాడుతున్నాను. మీ మాటలు నాకు వినబడుతున్నాయి. నేను మీకు జైలర్ని" అని పద్మావతీదేవి గుర్తి చేసింది ఫోన్‌లో.

వెంకన్న ఫోన్ క్రింద పెట్టేసి స్వరం తగ్గించి "నా మాటలు వంటింట్లోని నా భార్యకు వినబడ్డాయి. వెంటనే తిడుతూ ఫోన్ చేసింది. చూశారా—పెళ్ళయ్యాక వాక్స్వాతంత్రం కూడా వుండదు" అన్నాడు.

వెంకన్న అసిస్టెంట్సు సీతమ్మ, రాజమ్మ ముసిముసిగా నవ్వుకున్నారు.

జనార్దనరావు కూడా నవ్వి "రాధతో నేను ప్రారంభించబోయే జీవితాన్ని జైలు జీవితంతో పోల్చకండి. అసలు నాకు జీవితం మీద ఆశ పుట్టించినదే రాధపైన ప్రేమ. లేకపోతే నేను ఏ నాడో చచ్చిపోయి వుండే వాణ్ని" అన్నాడు.

వెంకన్న అతన్ని వివరాలడగలేదు. ప్రతి ప్రేమికుడూ ప్రియురాలి కారణంగానే తన శూన్యజీవితం నిండుగా అయిందని అనుకుంటాడు. అది పెద్దగా పట్టించుకోవాల్సిన విషయంగాదు.

"మీ ఆహ్వానానికి థాంక్స్!" అన్నాడు వెంకన్న.

ఆ యువకుడు వెళ్ళిపోయాడు.

"ఈ కుర్రాడికి భయమూ, కంగారూ యెక్కువ. ఓ హత్యకేసులో పోలీసులు ఇతన్ని ప్రశ్నించారు. దానికే భయపడిపోయాడు. అతనికేం ప్రమాదం లేదని నేను చెప్పినా తనా హత్యకేసులో ఇరుక్కున్నాననే భావించాడు. కేసు ముగిశాక తను పెద్దగండం తప్పించుకున్నా

నని—అదీ నా కారణంగా నేననీ నమ్మాడు. ఇలాంటి వాడు ఎప్పుడైనా నిజంగా తనే హత్య చేస్తే యెలా ప్రవర్తిస్తాడో?" అన్నాడు వెంకన్న.

2

"శవాన్ని చూస్తావా?" అనడిగాడు ఇనస్పెక్టర్ శంకర్రావు.

వెంకన్న తలాడించాడు. ఇద్దరూ వెళ్ళి శవాన్ని చూశారు:

నీటిలో నానడంవల్ల శవం బాగా ఉబ్బి వుంది.

"ఇది హత్యేనా అయుండాలి. ఆత్మహత్యేనా అయుండాలి!" అన్నాడు శంకర్రావు.

"అయ్‌సీ - మరింకే అవకాశమూ లేదా?" అన్నాడు వెంకన్న వెటకారంగా.

శంకర్రావు నాలిక్కరుచుకుని "నా ఉద్దేశ్యమేమి టంటే ఇది ప్రమాదవశాత్తూ అనుకోకుండా జరిగిన సంఘటన కాదని!" అన్నాడు.

"వివరాలు చెప్పగలవా?" అన్నాడు వెంకన్న.

"హతురాలి పేరు రాధ...."

"హతురాలు అంటే హత్య చేయబడిందనే నువ్వు నమ్ముతున్నావన్న మాట!" అన్నాడు వెంకన్న సాలోచనగా.

"పోనీ....చనిపోయిన అమ్మాయి పేరు రాధ. ఆమె వివాహానికింక మూడురోజులు వ్యవధి వుంది. వారిది ప్రేమ వివాహం. వివాహానికి ముందే ఇద్దరికీ బాగా పరిచయం వుంది. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ప్రాణం అని రాధ ఇంట్లోని వారంటున్నారు. రాధ చనిపోయిన సమయంలో ఆమెకు కాబోయి ఆగిపోయిన భర్త జనార్దన

రావుకు పటిష్టమైన ఎలిబీ వుంది. అతన్ని ప్రశ్నిద్దామను కుంటే మనిషి మెంటల్ షాక్ తిన్నవాడిలా అయి పోయాడు. కానీ" ....అని ఆగాడు శంకర్రావు.

"కానీ....?!" అన్నాడు వెంకన్న కుతూహలంగా.

"రాధ చనిపోవడానికి రెండు మూడు రోజుల ముందునుంచీ ఆ యింటి వాతావరణం హఠాత్తుగా మారిం దనీ—అంతవరకూ ఉత్సాహంగా ఉండేవారంతా మౌనంగా గంభీరంగా అయినారనీ చుట్టుపక్కల వాళ్ళు చెప్పారు. రాధ రేపు చనిపోతుందనగా సాబోలు— జనార్దనరావు, రాధ కలిసి ఒక నర్సింగ్ హోంకు కూడా వెళ్ళినట్లు తెలిసింది. అక్కడ ఎంక్వయిరీ చేయగా ఏమీ సమాచారం లభించలేదు. ఇంతకీ విషయం రాధ శీలానికి సంబంధించినదని మాకో అనుమానం వచ్చింది. ఎందు కంటే...." మళ్ళీ ఆగాడు శంకర్రావు.

"ఎందుకంటే....?!" అనడిగాడు వెంకన్న.

"రాధ కన్య కాదనీ....మరణించడానికి పూర్వం ఆమెకు పురుషుడితో కనీసం ఒక్కసారైనా అనుభవం అయివుండాలనీ డాక్టరు అంటున్నాడు...." అన్నాడు శంకర్రావు.

"వ్హాట్!" అన్నాడు వెంకన్న. ఇటువంటిది అత నూహించినట్లులేదు. ఒక్కక్షణం ఆలోచనలో పడి పోయాక "సరే నీ పూర్తి కథ చెప్పు!" అన్నాడు.

"చెప్పడానికేముంది? రాధ, జనార్దనరావు ఒక రొన్నకరు ప్రేమించుకున్నారు. కలిసిమెలిసి తిరిగారు. ఇంటిల్లపాదికీ ఈ ప్రేమ ఇష్టంకాగా అది వారి పెళ్ళికి దారి తీసింది. అయితే జనార్దనరావుకు ఏ కారణంగానో రాధ శీలంపైన అనుమానం కలిగింది. అతని అనుమానానికి

స్పష్టమైన ఆధారం ఏదో లభించింది. అది రాధ ఇంట్లో చెప్పాడు. దాంతో ఆ ఇంటి వాతావరణం మారిపోయింది. అందరికీ రాధ భవిష్యత్తు గురించి బెంగపట్టుకుంది.

అప్పుడు జనార్దనరావు తన అనుమానాన్ని పూర్తిగా బలపర్చుకోవడంకోసం ఆమెను ఓ నర్సింగ్ హోంకు తీసుకు వెళ్ళి పరీక్ష చేయించాడు. అతడి అనుమానం బలపడింది. ఆ నర్సింగ్ హోం నడిపే లేడీ డాక్టరు రాధ గురించి తన కేమీ తెలియదనడానికి కారణం అదే! జనార్దనరావు రాధతో తెగ తెంపులు చేసుకోవాలనుకున్నాడు. మర్నా డామె చనిపోయింది. ఊరి చివరకు వెళ్ళి నదిలో దూకింది. తన ప్రేమ విఫలమైందన్న విరక్తితో ఆమె నదిలో దూకిందా—లేక తన నామె మోసం చేసిందన్న కసితో, ఆమెపై పగబట్టి జనార్దనరావామెను హత్య చేశాడా అన్న విషయం కాలమే తేల్చాలి. ఇప్పుడు జనార్దనరావుకున్న ఎలిబీని ఛేదించడం మావల్ల కాదు. అందువల్ల మాకు ఆత్మహత్యే గత్యంతరమయింది—" అన్నాడు శంకర్రావు.

"మధ్య మీ రెండుకూ ఆత్మహత్య చేసుకోవడం?" అన్నాడు వెంకన్న నవ్వుతూ.

"అంటే నా ఉద్దేశ్యం—ఇది హత్యా, ఆత్మహత్యా అన్న విషయం తేల్చడంతో మా కిప్పుడు ఆత్మహత్య మాత్రమే యెన్నుకోవాలని వుంది అని. అయినా కేసులో అడుగు ముందుకు వెయ్యని పరిస్థితుల్లో యిలాంటి నిర్ణయాలు తీసుకోవడం ఆత్మహత్యతో సమానమే గదా—" అన్నాడు శంకర్రావు.

వెంకన్న అక్కణ్నించి రాధ యింటికి వెళ్ళాడు. వాళ్ళంతా దుఃఖ సముద్రంలో ఉన్నారు. శవం తమకు

అప్పగించబడగానే అంత్యక్రియలు జరిపించడానికి కూడా యేర్పాట్లు చేస్తున్నారు. ఇంట్లో యెవ్వరికీ కూడా జనార్దనరావు మీద అనుమానం లేదు. పైగా అంతా అతన్ని దేవుడని అంటున్నారు.

ఇది చాలా విడ్డూరంగానే తోచింది వెంకన్నకు.

ఇంట్లో ఒక్కరు కూడా జనార్దనరావును అనుమానించడం లేదు. వాళ్ళ ఆదరాభిమానాలు పొందడానికి జనార్దనరావు ఏం చేశాడు? రాధ శీలవతికాదని తెలిసి కూడా ఆమెను క్షమించేడా? ఆమెను వివాహం చేసుకునేందుకు సిద్ధపడ్డాడా? అది భరించలేకనే రాధ ఆత్మహత్య చేసుకుందా? లేదా జనార్దనరావు నయవంచన చేసి రాధను చంపేశాడా?....

మరి అతడికున్న ఎలిబీ....?

దాందేముంది! రాధ నతను స్వయంగా చంపనవసరం లేదు. ఎవరిద్వారానైనా చంపవచ్చు.

ఎవరిద్వారానైనా అన్న ఆలోచన రాగానే వెంకన్న వులిక్కిపడ్డాడు.

శంకర్రావుకీ ఆలోచన ఎందుకు రాలేదు?

శంకర్రావుకా ఆలోచన యెందుకు రాలేదో— వెంకన్నకు వెంటనే స్ఫురించింది.

వెంకన్నకే కాదు. ఒక్కసారి జనార్దరావు ముఖం స్ఫురిస్తే యెవరికైనా అతను హత్యలు చేయడానికి మనుషులను నియోగించగల సమర్థత ఉన్నవాడన్న ఆలోచన రాదు.

అలాంటివాణ్ని హంతకుడని మాత్రం యెలా అనుకునేది?

హత్య సంగతి వేరు. తాత్కాలికావేశంలో మనిషి

యెంత ఘోరమైనా చేయగలడు. కానీ హత్యలు చేయించ డానికి తాత్కాలి కావేశం చాలదు.

అందువల్ల జనార్దనరావు హత్య చేసి వుండవచ్చు. కానీ చేయించి వుండడు.

3

"హలో!" అందా అమ్మాయి.

"ఎవరు మీరు?...." అన్నాడు ఆ అబ్బాయి ఆశ్చర్యంగా.

"వయసులో ఉన్న అబ్బాయిని—వయసులో వున్న అమ్మాయి పలకరి స్తే—నువ్వు జవాబివ్వాలి గానీ మీ రని జవాబిచ్చేవాళ్ళంటే నాకు గిట్టదు. నా పేరుతో పిలి స్తే యింతా సంతోషి స్తాను. నా పేరు ప్రభ!" అందా అమ్మాయి.

"హాయ్ ప్రభా! నా పేరు సురేష్‌కుమార్!"అన్నాడు ఆ అబ్బాయి.

"చెప్పాలంటే నా పేరూ పెద్దదే. వీర వెంకట జనార్దన లక్ష్మీప్రభ! మనలాంటివాళ్ళు కలుసుకున్నప్పుడు పేర్లు పిల్చుకోడానికే సమయమంతా గడిచిపోకూడదని నా పేరు సింపుల్‌గా చెప్పాను. నువ్వూ సింపుల్‌గా సురేష్ అనో, కుమార్ అనో చెబితే సంతోషించేదాన్ని-" అంది ప్రభ.

"పోనీ—నీ యిష్టం అలాగే పిలు...." అన్నాడు సురేష్‌కుమార్ లోలోపల ఈ పరిచయానికి యెంతగానో ఆనందిస్తూ. ప్రభ చాలా చాలా చాలా అందంగా వుంది. కావాలని తన్ను పలకరించి నర్మగర్భంగా మాట్లాడుతోంది. అసలీమె ఉద్దేశ్యమేమిటో తెలుసుకోవాలి!

"నీ పేరు నాకు నచ్చలేదు. నిన్ను నేను విజయ్ అని

పిలిస్తే అభ్యంతరమా?" అంది ప్రభ.

"అభ్యంతరం లేదు. ఆ పేరంటే నీ కిష్టమా?" అన్నాడు సురేష్‌కుమార్.

"ఆ పేరంటే నాకు పెద్ద యిష్టమేం లేదు!" అని నవ్విందామె—"నాకు అమితాబ్‌బచ్చనంటే చాలా యిష్టం. అమితాబ్‌బచ్చన్ పేరు సాధారణంగా అన్ని సినిమాల్లోనూ విజయ్ అనే ఉంటోంది మధ్య. అందుకని నా కిష్టమైన వాళ్ళందర్నీ ఆ పేరుతో పిల్చుకుంటాను. నువ్వు అమితాబ్‌బచ్చనంత స్మార్టుగా ఉన్నావు—"

సురేష్‌కుమార్ సిగ్గుతో మెలికలు తిరిగి—"నాకంటే నువ్వే అందంగా వున్నావు—" అన్నాడు.

"మగాడి కళ్ళకు ఆడది అందంగా కనబడ్డం సాధారణం. ఆడదాని కళ్ళకు మగాడు కనబడ్డం అసాధారణం—" అని ముగ్ధమోహనంగా నవ్వింది ప్రభ—"మా యింటి కొస్తావా?"

"ఆడపిల్ల పిలిస్తే రాదనకూడదని మా తాత అంటూంటాడు. నాకు మా తాత మాట వేదవాక్కు—"

"తాతగారి మాట వినే కుర్రాడివా నువ్వు—ఇదో వెరైటీ—" అందామె.

ఇద్దరూ ఓ రిక్షా ఎక్కారు. ఇద్దరూ ఒకరికొకరు తగుల్తూ కూర్చుంటే అతడికి చాలా హాయిగా ఉంది. "ఈ రోజు నక్కను తొక్కొచ్చాను—" అనుకున్నాడతను.

రిక్షాలో ఆమె చాలా సరదాగా మాట్లాడిందతనితో. రిక్షాను ఒకచోట ఆపమని ఆమే చెప్పింది. రిక్షాకు డబ్బులు అతనే ఇచ్చాడు.

ఆమె ముందుకు దారితీస్తూంటే అతనామెను అనుసరిం

చాడు. ఇద్దరూ అలా నడుచుకుంటూ ఒక ఏకాంత ప్రదేశంలోని బంగళా దగ్గరకు వచ్చారు.

"ఇదే మా యిల్లు" అందామె

అంతవరకూ ఆమె మాటల మైకంలో వున్న సురేష్ కుమార్ ఉలిక్కిపడి ఆ బంగళాను, పరిసరాలను పరీక్షగా చూశాడు.

బంగళా అందంగా వుంది. చుట్టూ మంచి గార్డెన్ కూడా వుంది. ఒక ప్రహరీగోడ కూడా వుంది. అయితే ఆ దరిదాపుల్లో ఎక్కడా ఇళ్ళుకానీ, మనుష్య సంచారం కానీ లేవు.

"ఇంత ఏకాంతంగా వుంటున్నావా?" అన్నాడు సురేష్‌కుమార్ ఆశ్చర్యంగా.

"నువ్వున్నావుగా. ఇప్పుడిలాంటి ఏకాంతమే బాగుంటుంది" అందామె!

ఆ క్షణంలో సురేష్‌కుమార్‌కి మరింకేమీ గుర్తురాలేదు. అతని ఊహలు మధురాతిమధురంగా వున్నాయి. అతని కన్నులు కలలతో నిండిపోతున్నాయి.

ఇల్లు తాళంవేసి వుంది. ప్రభ తనే తాళంతీసి లోపల ప్రవేశించి లైటువేసింది.

"ఇల్లు చాలా బాగుంది?" అనుకున్నాడు సురేష్ కుమార్.

ప్రభ అతనికి ఇల్లంతా చూపించి "ఇంత యింట్లో నేనొక్కర్తినే వుంటున్నానని ఆశ్చర్యపోకు. ఇలా వుండడమే నాకు ఇష్టం. నేను నాకు వరుణ్ని వెతుక్కుంటున్నాను. అన్ని విధాలా నాకు నచ్చినవాణ్ణే నేను పెళ్ళి చేసుకుంటాను. నీ ప్రవర్తననుబట్టి నిన్నిక్కడ యెన్ని రోజులుంచుకునేదీ నిర్ణయిస్తాను" అంది.

"నీ లాంటి ఆడపిల్లలసంఖ్య దేశంలో యింకా పెర గాలి!" అన్నాడు సురేష్ కుమార్.

"ఇక్కణ్నుంచి బైటకు వెళ్ళేటప్పుడు కూడా ఇదే మాట అనుకోగలిగితే నువ్వు ఎప్పుడూ ఇక్కడే వుంటావు" అంది ప్రభ.

తర్వాత ఆమె అతన్ని స్నానం చేసిరమ్మంది. అతను స్నానంచేసి రాగానే కట్టుకుందుకు ఉతికి ఇస్త్రీ చేసిన లుంగీపంచ, తెల్లటిచొక్కా వుంచింది. తర్వాత తనూ స్నానంచేసి వచ్చింది. తెల్లచీర కట్టుకుంది. మల్లెపూలు పెట్టుకుంది. జడ వదులుగా వేసుకుంది. అతని వద్దకు వచ్చి మత్తుగా చూసి "ఎలా వున్నాను విజయ్" అనడిగింది.

చటుక్కున ఆమెచేయి పట్టుకుని "నా నోట మాటలు రావింక. నన్నూరించకు. నేను నీ వాణ్ని. నీ దాసుణ్ని. త్వరగా నన్ను కనికరించు" అన్నాడు సురేష్‌కుమార్.

"ఒక్కనిముషం ఆగు. నాకు ఆకలిగా వుంది. ఇద్దరం కలిసి భోంచేశాక నే—సరదాలు—" అందామె.

ఒక ఫ్లాస్కునిండా పాలున్నాయి. ఇంట్లో ఆపిల్ పళ్ళున్నాయి. ఒక పళ్ళెంలో స్వీట్సు, ఆపిల్ ముక్కలు తెచ్చిందామె. అవి ఇద్దరూ కలిసి తిన్నారు. తర్వాత చెరో గ్లాసెడు పాలూ తాగారు.

భోజనం అవుతున్నంతసేపూ ప్రభ చిలిపిచేష్టలతో అతన్ని రెచ్చగొడుతూనే వుంది. పైట జార్చి సవరించు కునేది. ఉండుండి అతడివంక కొంటెగా చూసేది. అనుకో కుండా అతణ్ని తాకినట్లు నటించి చటుక్కున దూరంగా జరిగిపోయేది.

"మరి భోజనాలు కూడా అయిపోయాయి" అన్నాడు సురేష్‌కుమార్.

"నువ్వికక్కడే వుండు. నేను పడకగదికి వెళ్ళి పక్కలు సరిచేసి నిన్ను పిలుస్తాను. నేను పిలిచేదాకా నువ్వక్కడకు రాకూడదు" అంది ప్రభ.

సురేష్‌కుమార్ అందుకూ అంగీకరించాడు. ఆమె వెళ్ళిపోయింది. సరిగ్గా అయిదు నిముషాలు అనంతరం "విజయ్ నువ్వు రావచ్చు" అన్న ప్రభ మధురస్వరం వినిపించింది.

సురేష్‌కుమార్ ఆత్రుతగా పడకగదివైపు వెళ్ళాడు.

కొద్దిసేపటి క్రితం అతను ప్రభ చూపించగా ఇల్లంతా చూసి వున్నాడు. పడకగదికి ఎలా వెళ్ళాలో దారి కూడా తెలుసు అతనికి. పడకగదికీ—మధ్య హాలుకీ—మధ్య ఓ చిన్న ఇరుకు వరండా వుంది. ఆ వరండాలో దీపం వెలగడంలేదు. సురేష్‌కుమార్ వరండాలోకి వెళ్ళాడు. పడకగది అతనికి కనబడుతోంది కానీ గదంతా చీకటిగా వుంది.

"ప్రభా గదిలో దీపంలేదా?" అన్నాడు సురేష్‌కుమార్ వరండాలోనే ఆగిపోయి.

"దీపముంటే నాకు సిగ్గు. కావాలంటే నువ్వే లోపలికి వచ్చి వేసుకో" అంది ప్రభ కంఠస్వరం.

ముసిముసిగా నవ్వుకుంటూ సురేష్‌కుమార్ గదిలోకి అడుగుపెట్టాడు.

గది బాగా చీకటిగా వుంది. అతను తలుపు పక్కన స్విచ్ తడిమి స్విచ్ వేశాడు. ఇంతలో గది తలుపు దగ్గరగా వేసుకుంది.

గదిలో ఒక్కసారి ప్రకాశవంతం కావడంతో అతడు కళ్ళు నులుముకున్నాడు. కళ్ళు తెరవగానే ఎదుటపడ్డ దృశ్యం చూసి అప్రయత్నంగానే కెవ్వుమని అరిచాడు.

4

"వివరంగా చెప్పు!" అన్నాడు డిటెక్టివ్ వెంకన్న.

"ఊళ్ళో మనుషులమధ్య ఒక కామినీ పిశాచి తిరుగుతోంది" అన్నాడు సురేష్‌కుమార్.

"కామినీ పిశాచాలు లేకపోతే మనుషులకెలా కుదురుతుంది? అందులో పెద్దగా భయపడవలసిందేమీ లేదు" అన్నాడు వెంకన్న.

"మీరలా వేళాకోళం చేయవద్దు. ఆ పిశాచిని నేను స్వయంగా చూశాను. దాన్ని స్వయంగా చూసి కూడా ఇంకా బ్రతికుండడం నాకు ఆశ్చర్యంగా వుంది" అన్నాడు సురేష్‌కుమార్.

"ఈ ప్రపంచంలో ఆశ్చర్యపడవలసిన విషయాలు కోకొల్లలు. అలా ఆశ్చర్యపడుతూ కూర్చుంటే యింకే పని చేయడానికీ తీరుబడి వుండదు. అందువల్ల నువ్వు నాకు అసలు విషయం చెప్పు!" అన్నాడు వెంకన్న.

"ఆ కామినీ పిశాచి అందమైన ఆడపిల్లలా తయారై వచ్చి నడిబజార్లో నన్ను పలకరించింది. తన పేరు ప్రభ అని చెప్పింది. తన వయ్యారంతో నా మతి పోగొట్టి తన ఇంటికి తీసుకువెళ్ళింది" అంటూ జరిగినదంతా చెప్పాడు సురేష్‌కుమార్.

"బాగానే వుంది—అదృష్టవంతుడివే!" అన్నాడు వెంకన్న.

"అంతవరకూ అదృష్టవంతుడినే—అసలు కథంతా తర్వాతే వుంది. నేను చాలా ఉత్సాహంగా ఆ గదిలోకి అడుగుపెట్టి లైటు వేశాను. అప్పుడు నాకు యెదురుగా కనబడ్డది అందమైన ప్రభ కాదు. ఒక మానవాతీత శక్తి తన అసలురూపంతో నా కళ్ళబడింది" అన్నాడు వెంకన్న.

"మానవాతీత శక్తి ఏమిటి?" అన్నాడు వెంకన్న చిరాగ్గా.

"అంత వికారరూపం మనుష్యులకుంటుందనుకోను. అందులోనూ అందమైన ప్రభ ఆ రూపం దాల్చడం మానవాతీతశక్తికి తప్ప సాధ్యం కాదు. కాలిపోయినట్లుండే ముఖం, అదే రకం శరీరం, చింపిరిజుట్టు, ఆకలిగొన్న చూపులు....ఎంతటి ధైర్యవంతుడికీ కూడా ఒకే ఒక్క-చూపులో భయం పుట్టించగల రూపమది!"

"అదేం చేసింది నిన్ను?"

"అది నన్ను రేప్ చేసింది" అన్నాడు సురేష్ కుమార్.

"ఒక ఆడది నిన్ను రేప్ చేయడమా?" వెంకన్న పకపకా నవ్వాడు.

"అది ఆడది కాదు సార్. దాని శక్తి అపరిమితం. దాని కామకాంక్ష అనంతరం. దాని స్పర్శ తల్చుకుంటేనే ఒళ్ళంతా గొంగళీపురుగు పాకినట్లనిపిస్తుంది. అలాంటిది అది నన్ను తనకోరిక తీర్చమని బలవంతపెట్టింది."

"నువ్వేం చేశావ్!"

"తప్పించుకుపోవాలని ప్రయత్నించాను. సాధ్యపడలేదు. తలుపులన్నీ వేసివున్నాయి. దానిది పశుబలం. అది నా మీద పడి రక్కింది, గీరింది. దాని స్పర్శ తగిలినప్పుడల్లా నా వళ్ళు అసహ్యంతో కంపించిపోయింది. కానీ నాకు తప్పలేదు. దాని బలానికి నేను లొంగిపోయి జీవితంలో అత్యంత అసహ్యకరమైన అనుభవం పొందాను."

"చాలా చిత్రంగా వుంది నీ కేసు...."

"మీరా కామినీ పిశాచిని పట్టుకోవాలి సార్!" అన్నాడు సురేష్‌కుమార్.

"అదిసరే-ముందు నువ్వక్కణ్నించి ఎలా బైటపడ్డావో చెప్పు!" అన్నాడు వెంకన్న.

"ఎలా బైటపడ్డానో నాకే తెలియదు. ఆ గదిలో నేను సొలిపోయి పడిపోయాను. మెలకువ వచ్చేసరికి గది తలుపులు తీసి వున్నాయి. పిశాచం లేదు. ఒక్క పరుగున అక్కణ్నించి బైటపడ్డాను. నా అనుభవం యెవ్వరికీ చెప్పకోలేదు. ఇల్లు చేరగానే ఇంటిల్లిపాదీ నా మీద ప్రశ్నల వర్షం కురిపించారు. ఏదో కుంటి సమాధానాలు చెప్పి తప్పించుకున్నాను. కాస్త తేరుకున్నాక మీ దగ్గరకు వచ్చాను...."

"నా దగ్గరకు రావడంతో ఏం ప్రయోజనమాశించావ్?" అన్నాడు వెంకన్న.

"ఈ ఊళ్ళో యిలాంటి దెయ్యం ఒకటున్నదని మీ బోటివారికి తెలియడం చాలా అవసరమని నాకు అనిపించింది" అన్నాడు సురేష్‌కుమార్.

"ఓ.కే మిస్టర్ విజయ్ నీ కేసంతా మా అసిస్టెంట్సు కథగా వ్రాశారు. అది కథ కాక నిజమే అయితే ఆ కామినీ పిశాచి అంతు నేను తేలుస్తాను. అది నువ్వు కన్న కలే అయుంటే నీ కల్పనాశక్తిని అభినందిస్తూ నా మిత్రులకిది కథగా చెప్పకుంటాను" అన్నాడు వెంకన్న.

"విజయ్ — ప్లీజ్ —నన్నా పేరుతో పిలవకండి" అన్నాడు సురేష్‌కుమార్ కంగారుపడుతూ.

5

నిర్జన ప్రాంతంలో వున్న ఆ బంగళా తలుపు తట్టాడు డిటెక్టివ్ వెంకన్న.

రెండు నిముషాలు పట్టింది తలుపు తెరుచుకోడానికి. తలుపు తెరిచిన వ్యక్తిని చూసి వెంకన్న ఆశ్చర్యపడ్డాడు.

అతను జనార్దనరావు.

"మీరా?" అన్నాడు వెంకన్న అప్రయత్నంగా.

జనార్దనరావు నీరసంగా నవ్వి "చాలా కాలం తర్వాత మనం కలుసుకుంటున్నాం. అన్నీ సవ్యంగా జరిగి వుంటే మనం నా పెళ్ళిలో కలుసుకోవలసివుండేది" అన్నాడు.

"ఇదా మీ ఇల్లు!" అన్నాడు వెంకన్న.

"ఈ మధ్యనే కొన్నానీ యిల్లు!" అన్నాడు జనార్దనరావు.

"ఎందుకని?"

జనార్దనరావు అదోలా నవ్వి "లోపలకు రండి అన్నీ వివరంగా చెబుతాను" అన్నాడు.

ఇద్దరూ లోపల కుర్చీల్లో కూర్చున్నారు.

"ఈ ఇంట్లో ఓ కామినీ పిశాచం వుందని చెప్పుకుంటున్నారు. అది పట్టుకున్న మగవాణ్ని ప్రాణాలు తీసేదాకా వదలదట. అందువల్ల ఈ యిల్లు అమ్ముడుకావడమే కష్టంగా వుంది ఇంటి యజమానికి. రెండు లాభాలను దృష్టిలో వుంచుకుని ఈ ఇల్లు కొన్నాను నేను. ఒంటరితనాన్ని కోరుకుంటున్న నాకు నిర్జనప్రాంతంలో ఉండే ఈ ఇల్లొక వరం. అందులోనూ చవగ్గా వస్తోంది. ఈ ఇంట్లో కామినీ పిశాచి నిజంగానే వుంటే నాకు దానిగురించి భయంలేదు. జీవితేచ్ఛ లేనివాణ్ని నేను!" అని నిట్టూర్చాడు జనార్దనరావు.

"పట్టుమని పాతికేళ్ళు లేని మీకు జీవితేచ్ఛ లేదంటే ఎలా? మీరు రాధని ప్రేమించి వుండొచ్చు. కానీ ఎంత కాలమని ఆమెను తల్చుకుని బాధపడతారు?" అన్నాడు వెంకన్న.

"ఈ ప్రశ్నకు జవాబుకోసం నేనూ అన్వేషిస్తున్నాను వెంకన్నగారూ!" అన్నాడు జనార్దనరావు.

"మీరలా అన్వేషిస్తూ వుండండి. మరో అన్వేషణలో నేనిక్కడికి వచ్చాను. నేను మీ యిల్లు ఓసారి శోధించి చూడవచ్చా?" అన్నాడు వెంకన్న.

"ఎందుకు?"

"ఈ యింట్లోని కామినీ పిశాచాన్ని వెదకడానికి?"

"ఇక్కడ కామినీ పిశాచం వున్నట్లు మీ కెవరు చెప్పారు?"

"సురేష్ కుమార్!" అన్నాడు జనార్దనరావు కళ్ళలోకి నిశితంగా చూస్తూ.

"అతనెవరు?" అన్నాడు జనార్దనరావు ఆశ్చర్యంగా.

"కామినీ పిశాచం వాతబడ్డవాడు...."

"ఇంకా బ్రతికేవున్నాడా?"

"ఉన్నాడు...." అని వెంకన్న ఆగి "నిన్నరాత్రి మీ రెక్కడున్నారు?" అనడిగాడు.

"ఇక్కడే ఈ ఇంట్లోనే!" అన్నాడు జనార్దనరావు.

"అసంభవం...." అన్నాడు వెంకన్న.

"అలా అంటే నేనేం చెప్పను? రెండాటల సినిమా చూసి ఇల్లుచేరి పడుకున్నాను...."

వెంకన్న కళ్ళు మెరిశాయి "అదే నేనడిగేది? అంటే మీరు రాత్రి చాలాసేపు ఇంట్లో లేరన్నమాట! రెండాటల సినిమాలు అంటే ఇంటిదగ్గర సాయంత్రం అయిదింటికే బయల్దేరి వుంటారు. ఇంటికొచ్చేసరికి కనీసం ఒంటిగంట అయ్యుంటుంది. ఈ ఇంట్లో నిన్నరాత్రి తొమ్మిదికీ పన్నెండింటికీ మధ్య కామినీ పిశాచి కథ నడిపింది. ఆమె దగ్గర ఇంటి తాళాలు కూడా వున్నాయి."

జనార్దనరావు ఆశ్చర్యంగా—"అసలేం జరిగిందో చెప్పండి!" అన్నాడు వెంకన్న చెప్పింది విని-"వెంకన్న గారూ—మీరిది నమ్ముతున్నారా?" అనడిగాడు.

"ఈ కథపై మీ అభిప్రాయం." అన్నాడు వెంకన్న.

"కథ అని మీరే అంటున్నారుగా" అని నవ్వి "నేను నెల్లాళ్ళుగా ఇందులో వుంటున్నాను. నాకే అనుభవమూ లేదు" అన్నాడు జనార్దనరావు.

వెంకన్న జనార్దనరావువంక తీవ్రంగా చూసి "సురేష్ కుమార్ కథైనా చెప్పివుండాలి, మీరు కథైనా నడుపుతూ వుండాలి. ఏ విషయం నే నెలాగూ తేల్చగలను" అన్నాడు.

జనార్దనరావు తల వంచుకుని "వెంకన్నగారూ మీరంటే నాకు అపారమైన గౌరవం వుంది. నే నే నేరమూ చేయడంలేదు. నన్ను నమ్మండి" అన్నాడు.

6

"హలో విజయ్!"

పిలుపు విని ఉలిక్కిపడ్డాడు సురేష్‌కుమార్. అల్లంత దూరంలో అతడికి ప్రభ కనబడింది. ఆమెను చూస్తూనే సురేష్‌కుమార్ కాళ్ళలో వణుకుపుట్టింది. ఏం చేయాలా అని ఆలోచిస్తూండగానే అతన్ని సమీపించింది ప్రభ.

"నా పేరు విజయ్‌కాదు" అన్నాడతను.

"కానక్కర్లేదు. ఆ పేరు నాకిష్టం. నువ్వంటే కూడా నాకిష్టం. అందుకని నీకా పేరు పెట్టుకున్నాను. ఆ కథంతా మళ్ళీ చెప్పాలా?" అంది ప్రభ.

"వద్దు. అసలు నువ్వు నాతో మాట్లాడొద్దు" అన్నాడు సురేష్‌కుమార్.

"అలాగంటావేమిటి విజయ్. ఈ సారి క్రిందటిసారిలా

జరగడానికి వీల్లేదు."

"అంటే?"

"నిన్నా ఇంటికి తీసికెళ్ళి కాసేపు ఊరించి తర్వాత నా దారిన నేను వెళ్ళిపోయాను.... అందుకుగానీ నీకు నా మీద కోపం రాలేదు గదా!" అంది ప్రభ.

సురేష్‌కుమార్ ఆశ్చర్యంగా ఆమెవంక చూసి "నీ కథ పూర్తిగా చెప్పు. అప్పుడు నేను నా కథ చెబుతాను" అన్నాడు.

"చెప్పడానికేముంది? చెప్పేశానుగా.... నువ్వంటే మనసుపడే నిన్నా యింటికి తీసుకువెళ్ళాను. అయితే చివరి క్షణంలో నిన్నింకా ఊరించాలనిపించింది. పడక గదిలోంచి బయటకు వెళ్ళిపోయాను. ఆ తర్వాత నువ్వు నన్ను చాలా తిట్టుకుని ఉంటావు. ఇలాంటి ప్రాక్టికల్ జోక్స్ నాకు చాలా అలవాటు...."

"నన్ను మళ్ళీ ఆ యింటికి తీసుకెళ్ళాలని నువ్వు ప్రయత్నిస్తున్నావేమో—అది నీకు సాధ్యం కాదు. ఈసారి నేను మోసపోను...." అన్నాడు సురేష్‌కుమార్.

"ఆ యింటికా—ఆ రోజు ప్రాక్టికల్ జోక్ పేరుతో అంత రాత్రివేళ ఆ యింట్లోంచి బైటకు వచ్చేసరికి నాకెంత భయమేసిందో తెలుసా? ఈసారి అలా జరగడానికి వీల్లేదు. అందుకే మనిద్దరికోసం మెజస్టిక్ హోటల్లో గది బుక్ చేశాను...." అంది ప్రభ.

మెజస్టిక్ హోటల్!

ఆ ఊరికి అది త్రీ స్టార్ హోటల్!

సురేష్‌కుమార్ ప్రభవంక పరిశీలనగా చూసి—"ఎవరీమె—? మనిషా, కామినీ పిశాచా?" అనుకున్నాడు. ఆమె అందం చూస్తుంటే అతడికి మనసు చలిస్తోంది.

కానీ జరిగిన అనుభవం అతన్ని అపాదమస్తకమూ వణికిస్తోంది.

"అయితే ఏమంటావ్?" అన్నాడతను చిరాగ్గా.

"ఈ రాత్రి మనం మెజస్టిక్ హోటల్లో—సరదాగా గడుపుదాం. ఆ రాత్రి మిస్సైపోయిన అనుభవాలన్నీ ఈ రోజు తనివితీరా పొందాలి. అందాల అప్సరస అనిపించుకొనే యీ ప్రభ యీ విజయ్‌కు ప్రేమ దాస్యం చేయాలి...."

సురేష్‌కుమార్ ఆలోచించి—"మెజస్టిక్ హోటల్‌కే అయితే వస్తాను...." అన్నాడు.

"కాక....మరెక్కడికి....రూం కూడా బుక్ చేసి ఉంచాను...." అంది ప్రభ.

సురేష్‌కుమార్‌లో మళ్ళీ కోర్కెలు తలెత్తసాగాయి. అతడికి ప్రభను నమ్మాలనే అనిపించింది. ఆ రోజు కామినీ పిశాచిగా తనపై అత్యాచారం జరిపిన మానసితశక్తి, ఈ ప్రభ ఒక్కరు కాదు. ఈ రెండు సంఘటనలు కాకతాళీయంగా జరిగాయి.

ఆమె ముందుగానే యేదైనా రిక్షా యేర్పాటు చేసి తప్పుదారి పట్టిస్తుందేమో నన్న భయంతో—"నేను రిక్షాను పిలుస్తాను...." అన్నాడతను.

"మెజస్టిక్ హోటల్‌కు వెడుతూ రిక్షాలో వెడతామా?" అంది ప్రభ హేళనగా.

"పోనీ....టాక్సీనే పిలుస్తాను...."

"నీకు నచ్చిన టాక్సీనే పిలు....—" అంది ప్రభ.

సురేష్‌కుమార్ తనే టాక్సీని పిలిచాడు. ఇద్దరూ టాక్సీ ఎక్కి కూర్చున్నారు. ఆమె మధురస్పర్శకు ఆనందించడానికి బదులుగా అతను టాక్సీ వెళ్ళే దారినే

జాగ్రత్తగా గమనించసాగాడు. తను ఏమరుపాటుగా ఉండగా టాక్సీ పూర్వపు బంగళావైపు దారి మళ్ళుతుందేమోనని అతడి భయం. అయితే అలాంటిదేమీ జరగలేదు. టాక్సీ మెజస్టిక్ హోటల్ ముందు ఆగింది.

"మనకు పదిహేడో నంబరు గది బుక్ చేశాను. వెళ్ళి రిసెప్షన్ నడిగి తాళాలు తీసుకోవడమే!...." అంది ప్రభ.

ఒకసారి హోటల్ వంక చూసి తృప్తిగా నిట్టూర్చాడు సురేష్‌కుమార్. ఇలాంటి హోటల్లోకి కామినీ పిశాచాలు రాలేవు. వచ్చినా తప్పించుకోలేవు. అనవసరపు భయాలతో తను మంచి అవకాశాన్ని పోగొట్టుకోకూడదు. తీగలాంటి ఆడది ప్రభ. ఎక్కడో అదృష్టవంతులకు తప్ప అలాంటి ఆడదాని పొందు లభించదు. అందులోనూ ఆమె వలచి వచ్చింది.

ఇద్దరూ తమ గదికి వెళ్ళారు.

"అద్భుతం!" అన్నాడు సురేష్‌కుమార్ ఆ గదిలోని యేర్పాట్లు చూసి. అతనంతవరకూ బహుశా అంత మంచి హోటల్ రూమ్ చూసి వుండడు. ఒక్కసారిగా అలాంటి రూమ్, అందులో—పక్కన ప్రభలాంటి అమ్మాయి— ....సురేష్‌కుమార్ శరీరంలోకి యేదో మైకం అప్పుడే ఆవహించసాగింది.

ప్రభ అతడి స్నానానికి యేర్పాట్లు చేసింది. మార్చుకునేటందుకు అతడికి బట్టలు సిద్ధం చేసింది. ఆ తర్వాత తనూ స్నానం చేసి బట్టలు మార్చుకుంది.

తెల్లచీర, తెల్లని రవిక, జడలో మల్లెపూలు, మత్తు కళ్ళు....నిగ నిగలాడే వళ్ళు....మిస మిస లాడే సొగసులు....సురేష్‌కుమార్ శరీరం దివ్యానుభూతికి

లోనవుతోంది.

అతని ఆత్రుతను గమనిస్తూనే ప్రభ అతణ్ని వూరించ సాగింది. ఇద్దరూ బ్రెడ్, ఆపిల్ ముక్కలు తిన్నారు. పాలు తాగారు.

అది విశాలమైన గది. ప్రవేశ ద్వారం దగ్గరే సోఫా లున్నాయి. కాస్త దూరంగా, మూలగా రెండు మంచా లున్నాయి. అంతవరకూ వాళ్ళిద్దరూ చెరో సోఫాలోనూ కూచ్చుని ఉన్నారు. ఉన్నట్లుండి ప్రభ లేచి—"నువ్విక్కడే వుండు—" అంది.

ఆమె తిన్నగా బెడ్ దగ్గరకు వెళ్ళింది. మంచంమీద పడుకుంది. ఆమెనే గమనిస్తున్నాడు సురేష్‌కుమార్. ఆమె చేయి మంచం పక్కనే వున్న స్విచ్ బోర్డుమీద పడింది. గది చీకటయింది.

"విజయ్—త్వరగా రా!" అంది.

సురేష్‌కుమార్ లేచాడు. సరిగ్గా అప్పుడే అతనికి పూర్వానుభవం తళుక్కుమంది. అతని మైకం విడి పోయింది....శరీరంలో సన్నని వణుకు ప్రారంభ మయింది....

ఇంతవరకూ అంతా ఇదివరకటిలాగానే జరిగింది. ఇప్పుడూ అంతే జరుగుతుందా?

అందమైన ప్రభ ఇప్పుడు కామినీ పిశాచిగా మారి పోతుందా?

ఆ వూహే సురేష్‌కుమార్ శరీరంలో వణుకును పెంచింది.

తనిప్పుడేం చేయాలి? మంచం దగ్గరకు వెళ్ళాలా? పలాయనం చిత్తగించాలా?

చాలాసేపు ఊగిసలాడాడు సురేష్‌కుమార్. చిట్ట

చివరకు అతను రిస్కు తీసుకోదలిచాడు. వణుకుతూనే మంచాన్ని సమీపించాడు. అతడి చేతులు స్విచ్ బోర్డు కోసం వెదికాయి.

గదిలో దీపం వెలిగింది.

మంచంమీద ప్రభ ముడుచుకుని పడుకుని ఉంది. తన అనుమానానికి నవ్వుకుంటూ అతను ఆమెను కుదుపుతూ తనవైపుకు తిప్పాడు. అంతే!

కెవ్వుమని అరిచాడతను.

ఆమె ప్రభ కాదు. కామినీ పిశాచి!

ఆమె అతన్ని గట్టిగా పట్టుకొని బిగి కౌగిలిలో ఉంచేసింది.

సురేష్‌కుమార్‌కు వొళ్ళంతా తేళ్ళూ జెర్రులూ పాకి నట్లయింది.

"వద్దు!....వద్దు!....నన్ను వదలిపెట్టు...." అరిచాడతను.

ఆమె అతడి పెదాలతో తన పెదాలు కలుపుతోంది....

అసహ్యకరమైన ఆ ముఖం. అంతకంటే అసహ్యకరమైన ఆ పెదాలు.

సురేష్‌కుమార్ సర్వశక్తులూ వుపయోగించి పెనుగులాడుతున్నాడు—కానీ అతడి బలం యెందుకూ పనికి రావడంలేదు. ఏ మగవాడూ కోరుకోని అసహ్యకరమైన అనుభవం అతడికి బలవంతంగా తటస్థపడుతోంది.

సురేష్‌కుమార్ తన్ను తనే నిందించుకుంటున్నాడు. ఒకసారి జరిగేక కూడా మళ్ళీ తను యెలా మోసపోయాడు? కామినీ పిశాచం మెజస్టిక్ హోటల్లోకి రాలేదనుకొన్నాడు. కానీ అది యిక్కడికి కూడా

వచ్చింది. రావడమేమిటి? తనే దానితో కలిసి వచ్చాడు. ప్రభ మనిషి కాదు. పిశాచం! ఒకసారి అనుభవమయ్యిందీ దాని తళుకు బెళుకులకు మరోసారి లొంగిపోయాడతను.

ఇప్పుడేం చేయాలి? ఇప్పుడెలా తప్పించుకోవాలి?

తప్పించుకోవడం సురేష్‌కుమార్‌కు సాధ్యం కాలేదు.

7

"నిన్న రాత్రి మీ హోటల్లో ఏదైనా రభస జరిగిందా?" అనడిగాడు వెంకన్న.

"నిన్నే కాదు. ఈ హోటల్ పెట్టి యిప్పటికి ఆరేళ్ళయింది. ఇంతవరకూ యెలాంటి రభసా జరగలేదు. మీరలా యెందుకు అడుగుతున్నారు?...." అన్నాడు మేనేజర్.

"ఒక్కసారి పదిహేడో నంబరు గదిని నేను చూడవచ్చా?"

"ష్యూర్—" అంటూ ఆయన రిజిష్టర్ తెరిచి—"ఉదయమే ఆ గది ఖాళీ చేయబడింది. సాయంత్రానికి మళ్ళీ బుక్కయింది—" అన్నాడు.

"నిన్న ఆ గది యెవరి పేరున బుక్కయిందో చెప్పగలరా?" అనడిగాడు వెంకన్న.

"దానికేం...." అంటూ ఓ క్షణంసేపు చూసి—"జనార్దనరావు—...." అన్నాడు మేనేజర్.

ఉలిక్కిపడ్డాడు వెంకన్న. ఈ జనార్దనరావుకీ, సురేష్ కుమార్‌కీ ఏదో సంబంధముంది. ఒకసారి కాదు. రెండోసారిగా యిలా జరిగిందంటే యిది కాకతాళీయం కాదు.

వెంకన్న వెళ్ళి గదిని పరిశీలించాడు. గదిలో ఎక్కడా యిద్దరు మనుషులు పెనుగులాడిన చిహ్నాలు లేవు. ఎంతో

నీటుగా సర్ది వుంది. వెంకన్న గదికి సంబంధించిన బేరర్స్‌ని పిలిచి ప్రశ్నలువేసి ఆ గది ఎప్పుడూ నీటుగానే వున్నట్లు గ్రహించాడు. అనుమానాస్పదమైన సంఘటనలు జరిగినట్లు ఎవరూ చెప్పలేకపోయారు.

"పోనీ—రాత్రి ఈ గదిలోంచి కేకలు వినబడ్డాయా?" అన్నాడు వెంకన్న మేనేజర్ని.

"మీ ప్రశ్నలు చాలా విచిత్రంగా వున్నాయి. ఇది సౌండ్‌ప్రూఫ్ గది. లోపలేం జరిగినా బైటకు వినిపించదు. మా కష్టమర్సు చాలామంది అదే కోరుకుంటారు...." అన్నాడు మేనేజర్.

ఇంక అక్కడ తెలుసుకోదగ్గ విశేషమేదీ లేదనిపించింది వెంకన్నకు. అతను అక్కణ్ణుంచి తిన్నగా జనార్దనరావు బంగళాకు వెళ్లాడు.

జనార్దనరావు బంగళాలోనే వున్నాడు.

"నమస్కారం. రండి. కూర్చోండి—" అంటూ మర్యాద చేశాడు జనార్దనరావు.

"నిన్నరాత్రి మీరెక్కడున్నారు?" సూటిగా అడిగాడు వెంకన్న.

"మెజస్టిక్ హోటల్లో—...." అన్నాడు జనార్దనరావు.

"ఇంత చక్కటి బంగళా వుండగా మీకు హోటల్ రూం ఎందుకావలసి వచ్చింది?"

"నా స్నేహితుడొకడు వస్తున్నట్లు వుత్తరం రాశాడు. అతనికి దెయ్యాలంటే విపరీతమైన భయం. నా బంగళాకు మాత్రం రాలేననీ తనకోసం ఒక మంచి హోటల్లో గది బుక్ చేయమనీ రాశాడు. మెజస్టిక్ హోటల్లో గది బుక్ చేశాను. కానీ యే కారణంవల్లనో అతను రాలేదు. నేను

రెండాటలు సినిమాలు చూసి—ఎలాగూ హోటల్ గది బుక్ చేశానుదా అని అక్కడకేపోయి పడుకుని తెల్లారేక లేచి ఖాళీ చేసేశాను...."

వెంకన్న అతనివంక అదోలా చూసి—"మీ స్నేహితుడు రాసిన వుత్తరం చూపిస్తారా?" అనడిగాడు.

"ష్యూర్!" అంటూ జనార్దనరావు అతనికి ఓ ఇన్లాండ్ లెటర్ అందించాడు. ఆ వుత్తరంలో జనార్దనరావు చెప్పిన వివరాలన్నీ వున్నాయి. అంతేకాదు. ఆ స్నేహితుడు సతీసమేతంగా వస్తున్నట్లు వుంది.

వెంకన్న ఆ వుత్తరం జనార్దనరావుకు అందించి—"మీ స్నేహితుడు సతీసమేతంగా వస్తున్నాడు. మీరేమో మీ పేరున హోటల్ గది బుక్ చేసి సినిమాకు వెళ్ళారు. ఒక వేళ అతను మధ్యలో వస్తే!" అన్నాడు.

"మధ్యలో ఎవరైనా వస్తే తాళాలిమ్మని రిసెప్షనిస్టుకు చెప్పాను...."

"అలా యెవరైనా వచ్చారేమో అడిగి తెలుసుకున్నారా?"

జనార్దనరావు ఒక్కక్షణం తటపటాయించి—"మీ దగ్గర దాచడమెందుకు వెంకన్నగారూ! నన్ను మొదట్నుంచే వాచ్ చేస్తున్నట్లున్నారు. ఒక జంట ఈ అవకాశాన్ని చక్కగా వుపయోగించుకొని నేను హోటల్ కు తిరిగివచ్చేసరికి వెళ్ళిపోయారు...." అన్నాడు.

"అలా ఎందుకనుకోవాలి? వాళ్ళే మీ స్నేహితులని యెందుకనుకోకూడదు?" అన్నాడు వెంకన్న.

"నా స్నేహితులైతే నేనొచ్చేవరకూ ఆగేవారు...." అన్నాడు జనార్దనరావు.

"అనుకోని అవాంతరం వచ్చిందేమో...."

"అలాంటిది జరిగిన మాట వాస్తవమే. నా గదిలో ప్రవేశించిన యువతి—తన భర్త అస్వస్థతగా వున్నాడని ఓ టాక్సీవాలా సహాయంతో భర్తను తీసుకుని వెళ్ళిపోయిందిట. అతడికి స్పృహ లేదుట. అయినప్పటికీ వాళ్ళు నా వాళ్ళే అయుంటే నాకు మెసేజ్ వదిలిపెట్టి వుండేవారు...." అన్నాడు జనార్దనరావు.

"అయితే వాళ్ళను గురించి మీరు పట్టించుకోలేదా?"

"లేదు...."

"మీరు వెళ్ళేసరికి గది ఎలా వుంది?"

"మామూలుగానే వుంది—" అన్నాడు జనార్దనరావు.

"గదిలో ఏ విశేషమూ కనిపించలేదా?"

"లేదు...."

"సరే...." అంటూ వెంకన్న లేచి—"మీ కారణంగా ఏదో పెద్ద నేరం జరుగుతోందని నాకు అనుమానంగా వుంది. నా దృష్టి మీమీద పడిందని గుర్తుంచుకోండి—" అన్నాడు.

"నేనే నేరమూ చేయనప్పుడు మీకు భయపడాల్సిన అవసరం లేదని నాకు తెలుసు...." అన్నాడు జనార్దనరావు. అతడి కళ్ళలో కనబడే నమ్మకం వెంకన్నను చకితుణ్ని చేసింది.

8

"హల్లో సురేష్!" అంది దీప.

"హాయ్ దీపా—ఏమిటి విశేషం?"అన్నాడు సురేష్ కుమార్.

"నువ్వే చెప్పాలి....చాలా కాలమైంది....మనం

కలుసుకుని....” అంది దీప.

“అవును....” అన్నాడు సురేష్‌కుమార్.

దీప అతడివంక ఆశ్చర్యంగా చూస్తూ—“అప్పటి కంటే యిప్పుడు యింకా స్మార్టుగా వున్నావు. సినిమా స్టార్సులా వయసుతోపాటు నీకు గ్లామర్ పెరుగుతున్నట్లుంది....” అంది.

సురేష్‌కుమార్ నవ్వి—“నా అందాన్ని మెచ్చుకున్నావంటే నీకు నామీద కోపం పోయినట్లేగా!” అన్నాడు.

దీప ముఖం అదోలాగైంది—“కోపమా—అది యీ జన్మకు పోదు. నేను నిన్ను నిజంగానే ప్రేమించాను. కానీ నువ్వు నన్ను అమాయకురాల్ని చేసి నా ప్రేమనుంచి పొందవలసింది పొంది—పెళ్ళి చేసుకోమనగానే సారీ చెప్పేశావు....” అంది.

“అదంతా ఎందుకులే-ఇప్పుడు నీకు పెళ్ళయిందిగా....” అన్నాడు సురేష్‌కుమార్.

“ఏం పెళ్ళిలే....మనసొక చోట....మను వొక చోట....” అని నిట్టూర్చింది దీప.

“ఇంతకీ ఈ ఊరెలా వచ్చావ్?”

“మా ఆయనకు డబ్బు పిచ్చి. నాచేత ఉద్యోగాలకు అప్లై చేయిస్తున్నారు. ఈ ఊళ్ళో ఇంటర్వ్యూ....”

“అయితే ఎవరింట్లో దిగావు?”

“చూశావుగా—అవతారం—ఇంకా ఎక్కడా దిగ లేదు. ఇంటర్వ్యూ రేపు....”

“ఇంటర్వ్యూ ఎక్కడ?”

దీప చెప్పింది.

“పోనీ....నువ్వు మా యింటికొచ్చి వుంటావా?”

"ఎందుకుండను?" అంది దీప చటుక్కున.

సురేష్‌కుమార్ కళ్ళు మెరిశాయి—"కానీ...." అని ఆగిపోయాడతను.

"నాకు తెలుసు. నేను మీ ఇంటికి రావడం నీ కిష్టముండదని. ఏదో వంక పెట్టి నేను రాకుండా చేస్తావ్...." అంది దీప.

"అదికాదు దీపా! నన్నపార్థం చేసుకోకు. ముందే చెప్పేస్తున్నాను. మా ఇంట్లో ఇప్పుడెవ్వరూ లేరు. నేనొక్కణ్ణే వున్నాను...."

"అయ్‌సీ....అయితే మరీ మంచింది" అంది దీప ఉత్సాహంగా.

సురేష్‌కుమార్ ఆశ్చర్యంగా "ఆడదానివి. అందులోనూ పెళ్ళైనదానివి. ఒప్పుకుంటావనుకోలేదు" అన్నాడు.

"ఒప్పుకోకపోవడానికి నువ్వు నాకేం కొత్త కాదు గదా! మెళ్ళో తాళి కట్టకపోయినా నాతో ఓ నెల్లాళ్ళు సంసారం చేశావు. ఆ అనుభూతులే ఇప్పటికీ నాకు ఊపిరి పోస్తున్నాయి."

సురేష్‌కుమార్ కళ్ళలో గర్వం కనబడింది "మరి నీ భర్త నిన్నపార్థం చేసుకోడా?"

"ఉద్యోగం కోసం ఒక్కర్తినీ పొరుగూరికి ఇంటర్వ్యూకు పంపించిన మహానుభావుడాయన. ఆయనకు భయపడాల్సిన అవసరం నాకు లేదు. నువ్వు కనిపించడం నా అదృష్టం అనుకుంటాను. నీకు భార్యను కాగల అదృష్టం నా కెలాగూ కలగలేదు. కనీసం అప్పుడప్పుడైనా మనమిలా కలుసుకోగలిగితే...."

సురేష్‌కుమార్ మనసు, తనువు పులకరించిపోయాయి.

అతను దీపతో కలిసి ఇంటికి వెళ్ళాడు. ఇద్దరికోసం తనే హోటల్ నుంచి క్యారియర్ భోజనం తెచ్చాడు.

"మీ ఇల్లు బాగుంది. అన్నీ కలిసివస్తే ఈ యింటి తాళాలు నా చేతుల్లోనే వుండేవి...."

"అవన్నీ మరిచిపో దీపా! ప్రస్తుతం మనకు భూతం వద్దు, భవిష్యత్తు వద్దు. వర్తమానం ఒక్కటే మన ముందున్నది" అన్నాడు సురేష్‌కుమార్.

"భవిష్యత్తు సంగతి సరే—భూతం నన్ను వదలడం లేదు. నిన్నెలా వదులుతుందో ఆశ్చర్యంగా వుంది" అంది దీప.

తర్వాత ఇద్దరూ ఒకరి తర్వాత ఒకరు స్నానాలు చేశారు. స్నానానంతరం బట్టలు మార్చుకుని భోజనాలు చేశారు.

దీప తెల్లరచీర కట్టుకుంది. తెల్లరవిక వేసుకుంది. జడలో మల్లెపూలు పెట్టుకుంది. ఆమె కళ్ళు మత్తుగా వున్నాయి. ఆమె వళ్ళు మిసమిసలాడుతోంది.

ఆమెనలా చూస్తూంటే సురేష్‌కుమార్‌కు హఠాత్తుగా ప్రభ గుర్తుకువచ్చి భయం వేసింది. అనుకోకుండా అతనామెవంక చూసి "నువ్వు దీపవేకదూ!" అన్నాడు.

"ఇప్పుడిదేం ప్రశ్న?" అంది దీప.

ఎందుకో సురేష్‌కుమార్ శరీరంలో వణుకు ప్రారంభమయింది. అది మదనతాపం పుట్టించిన వణుకుకాదు. పాత అనుభవాలు గుర్తుకొచ్చి కలుగుతున్న వణుకు.

"అదేంటలా వణుకుతున్నావ్ సురేష్?" అంది దీప.

సురేష్‌కుమార్ తేరుకున్నాడు. ప్రభ అయితే తనకు తెలియని అమ్మాయి కాబట్టి కామినీపిశాచి అనుకోవచ్చు. కానీ దీప తనకు తెలిసిన అమ్మాయి. ఆమె కామినీపిశాచి

కావడానికి అవకాశంలేదు. తను అనవసరంగా భయపడు తున్నాడు. అదీగాక ప్రభ అయితే తనను విజయ్ అని పిలిచేది. అది కామినీపిశాచి కిష్టమైన పేరు. దీప తనను సురేష్ అనే పిలుస్తోంది. అతను నెమ్మదిగా ఆమెను సమీ పించి దగ్గరగా లాక్కున్నాడు. ఒక్కక్షణంలో కౌగిలి బిగిసింది కానీ వెంటనే దీప అతన్ని విడిపించుకుని "ఇక్కడ కాదు" అంది.

"అంటే?"

"నువ్విలా కూర్చో. కళ్ళు మూసుకో. నేను నిన్ను పిలుస్తాను. నా పిలుపు వినేవరకూ నువ్వు కళ్ళు తెరవ కూడదు. తెలిసిందా" అంటూ అతడి పెదాలను మృదు వుగా తన పెదాలతో చుంబించింది.

సురేష్‌కుమార్ తనువు పులకరించింది. అతను కుర్చీలో చతికిలబడి కళ్ళు మూసుకున్నాడు. మెత్తని అడుగుల చప్పుడు అతనికి క్రమంగా దూరమైంది. కొద్దిసేపటికి "సురేష్ త్వరగా రా" అని పిలుపు వినిపించింది. ఆ పిలుపు పడకగదిలోంచి వస్తోంది.

సురేష్‌కుమార్ ఉత్సాహంగా లేచాడు. రెండు అంగల్లో బెడ్రూం సమీపించి గుమ్మం దగ్గర ఆగి పోయాడు.

మంచంమీద దీప ప్రవరాఖ్యుల్ని కూడా రెచ్చగొట్టే పద్ధతిలో పడుకుని వుంది.

సురేష్‌కుమార్ గదిలోకి ఉత్సాహంగా ముందడుగు వేసి ఆగిపోయాడు. ఛటుక్కున గదిలో దీపం ఆరి పోయింది.

"వాటీజ్ దిస్ దీపా!" అన్నాడతను చిరాగ్గా.

"నేను కోరేది చీకటి. నా చీకటికి వెలుగునివ్వాల్సింది

దీపం కాదు నువ్వు. త్వరగా రా సురేష్!" అంది దీప.

సురేష్‌కుమార్ తడుముకుంటూ నెమ్మదిగా మంచాన్ని సమీపించాడు. మంచం చేతికి అందగానే దీప కోసం తడి మాడు. అతడి చేతికి ఆమె కాలు తగిలింది.

"నీ స్పర్శకు నా వళ్ళు పులకరిస్తోంది విజయ్!" అందామె.

విజయ్ అన్న పిలుపు వినడంతోనే సురేష్‌కుమార్ శరీరం ఒక్కసారిగా చల్లబడిపోయింది. అప్పుడే సరిగ్గా గదిలో దీపం వెలిగింది.

సురేష్‌కుమార్ కళ్ళు మూసుకున్నాడు.

మంచం మీద దీపలేదు. కామినీపిశాచి వుంది.

'కెవ్వు'మని అరిచి వెనుతిరిగాడతను. కానీ ప్రయోజనంలేదు. తలుపులు వేసివున్నాయి. ఈలోగా కామినీ పిశాచి అతణ్ని అందుకోనే అందుకుంది.

"ప్లీజ్. వద్దు. నేనది భరించలేను. నన్ను వదిలిపెట్టు" దీనంగా రెండుచేతులూ జోడించి వేడుకున్నాడతడామెను.

అందవికారమైన ముఖంతో అత్యంత భయంకరంగా నవ్విందామె. అతణ్ని బలంగా దగ్గరగా తీసుకుని పెనుగులాడుతున్న అతడి చేతుల్ని నొక్కిపట్టి అతడి ముఖం మీద ముద్దులు కురిపిస్తోందామె.

"హే భగవాన్-ఏమిటి నాకీ శిక్ష!" అంటూ వాపోయాడు సురేష్‌కుమార్.

కామినీ పిశాచి బారినుంచి భగవంతుడుకూడా అతన్ని రక్షించలేదు.

9

"వెంకన్న గారూ-దాన్ని పట్టుకోవడం మీవల్ల కాదు" అన్నాడు సురేష్‌కుమార్. అతడి ముఖం పాలిపోయి వుంది. మనిషి నిస్త్రాణగా వున్నాడు.

"నీ సంగతే నీకు తెలియదు. నా సంగతి నీకేం తెలుస్తుంది?" అన్నాడు వెంకన్న.

"నా సంగతి నాకు తెలియదని కూడా ఒప్పుకోక తప్పదు. అది నిన్న స్వయంగా నా ఇంటికే వచ్చి నన్ను రేప్ చేసింది" అన్నాడు సురేష్‌కుమార్.

వెంకన్న ఆశ్చర్యంగా "జరిగిందేమిటో వివరంగా చెప్పు" అన్నాడు.

"ఆ వివరాలన్నీ చెప్పాలంటే అదంతా మళ్ళీ నేను గుర్తు చేసుకోవాలి. ఆ పని చేయలేను. అదొక అత్యంత భయంకరమైన అనుభవం" అన్నాడు సురేష్‌కుమార్.

"అలా అంటే నాకు కథ ఎలా తెలుస్తుందీ!" అన్నాడు వెంకన్న.

"ఆ కామినీపిశాచి ఓ బంగళాలో వుంటుందేమోననుకున్నాను. కానీ అది మెజస్టిక్ హోటల్లో వెలసింది. ఆఖరికి నిన్న నా ఇంట్లో కూడా వెలసింది. అది రాలేని చోటులేదు" అన్నాడు సురేష్‌కుమార్.

"అసలది నీ యింట్లోకెలా వచ్చింది?"

"అది ధరించగల రూపం ప్రభది మాత్రమే అనుకున్నాను. ఆ వేషంలో అది నన్ను రెండుసార్లు మోసం చేసింది. ఇంక ప్రలోభపడననుకుందో ఏమో-ఈ సారి అది వేషం మార్చి దీప అనే నా పాత స్నేహితురాలి వేషంలో వచ్చింది. అది యిన్ని వేషాలు మార్చగలదని నాకేం తెలుసు? నిజంగా దీపే అనుకుని మా యింటికి తీసు

కెళ్ళాను."

"దీప ఎవరు?"

దీప గురించి చెప్పాడు సురేష్‌కుమార్. అదంతా విని "అయినా నీకిదేం బుద్ధయ్యా-కామినీపిశాచి నీ మీద పగ బట్టిందని తెలిసి కూడా, రెండనుభవాలయ్యాండి కూడా ఇంకా ఆడపిల్ల కనబడగానే కక్కుర్తి పడతావ్!" అన్నాడు వెంకన్న.

"బుద్ధి వచ్చిందండీ - ఇప్పుడు నా భార్య పుట్టింట్నించి తిరిగొచ్చినా ముట్టుకోవాలంటో భయమేసేలా వుంది. ఆ కామినీపిశాచి యెవరో నా మీద యింతలా ఎందుకు పగబట్టిందో నాకు అర్థం కాకుండా వుంది" అన్నాడు సురేష్‌కుమార్.

"నువ్వు నాకో రెండొందల రూపాయలు ఫీజుగా యిచ్చుకుంటే నీకో చిన్న క్లూ యివ్వగలను" అన్నాడు వెంకన్న.

"క్లూ అంటే!"

"కామినీపిశాచి నిన్నెందుకు పట్టుకుందో నాకు తెలియదు. కానీ నీకు తెలుసుకునే అవకాశం వుంది. అది నీకు కలిగించేదే నా క్లూ" అన్నాడు వెంకన్న.

సురేష్‌కుమార్ జేబులోంచి పర్సుతీసి డబ్బు లెక్క పెట్టాడు. అందులో మూడొందల యాభై చిల్లర వుంది. అందులోంచి రెండొందలు తీసి వెంకన్న కిచ్చి "ఆ క్లూ ఏమిటో చెప్పండి!" అన్నాడు.

"నిన్ను మొట్టమొదట కామినీపిశాచి ఏ బంగళాలో అయితే బలవంతం చేసిందో ఆ బంగళాను కొద్దికాలం క్రితమే జనార్ధనరావు అనే అతను కొనుక్కున్నాడు. జనార్ధనరావు నీకు తెలుసా?"

"జనార్దనరావా?" అన్నాడు ఆశ్చర్యంగా సురేష్ కుమార్.

"నువ్వు మెజస్టిక్ హోటల్లో ఏ గదిలో వున్నావో ఆ రోజున ఆ సమయానికి ఆ గది జనార్దనరావు పేరున బుక్ చేయబడింది" అన్నాడు వెంకన్న మళ్ళీ.

"ఏమిటి మీర నేది?" అన్నాడు సురేష్‌కుమార్ కళ్ళు పెద్దవి చేసి.

"జనార్దనరావుకీ నీకూ ఏమిటి సంబంధమో తెలియదు. ఇప్పుడతని యింటికి ఫోన్ చేసి దీప అనే అమ్మాయక్కడ ఉందేమో అడిగి తెలుసుకో" అన్నాడు వెంకన్న.

సురేష్‌కుమార్ వెంకన్నను అడిగి ఫోన్ నంబర్ నోట్ చేసుకుని—నెంబర్ డయల్ చేయబోయాడు.

"ఫోన్‌కి అర్ధరూపాయి ఛార్జి" అంది సీతమ్మ చటుక్కున.

సురేష్‌కుమార్ పర్సులోంచి డబ్బుతీసి సీతమ్మకిచ్చి "మీ కస్టమర్సుని మీరు ట్రీట్ చేసే పద్ధతి యిదేనా?" అన్నాడు.

"పరాయి ఆడపిల్లని గదికి తీసుకెళ్ళి కష్టాలు కొని తెచ్చుకుని సాయం అడగడానికి వచ్చిన కస్టమర్సుకి ఇక్కడ ట్రీట్‌మెంట్ యిలాగే వుంటుంది" అంది సీతమ్మ.

సురేష్‌కుమార్ ఆమె మాటలు పట్టించుకోకుండా జనార్దనరావుకి ఫోన్ చేశాడు.

"హలో!" అంది అవతలనుంచి ఒక స్త్రీ కంఠస్వరం.

"మీ పేరు తెలుసుకోవచ్చా!" అడిగాడు సురేష్ కుమార్.

"నా పేరు దీప" అందవతలి కంఠస్వరం.

సురేష్‌కుమార్ చేతిలోంచి ఫోన్ జారిపోయింది. అతను వున్నవాడున్నట్లుగా నేలమీద కూలబడ్డాడు.

వెంకన్న కంగారుగా "ఏమయింది?" అన్నాడు.

"జనార్దనరావుకి ఫోన్ చేస్తే దీప పలికింది" అన్నాడు సురేష్‌కుమార్ నీరసంగా.

"వ్వాట్!" అంటూ కుర్చీలోంచి యెగిరిపడ్డాడు వెంకన్న. తన ఊహ మరీ ఇంత పచ్చినిజమైతీరుతుందని అనుకోలేదు "అయితే యిప్పుడే మనమిద్దరం అతడింటికి వెడదాం...."

"వద్దుసార్! జనార్దనరావింటికి నేనే స్వయంగా వెడతాను. అతను నాకు తెలుసు. కానీ యిందులో అతడి ప్రమేయమేమీ వుంటుందని నేననుకోవడంలేదు. కామినీ పిశాచి మానవతీతాశక్తి అన్న విషయం నేను అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను" అంటూ సురేష్‌కుమార్ లేచి నిలబడి "వస్తాను సార్. మళ్ళీ మీ ఇంటికి రావాల్సిన అవసరం లేకుండా చేసుకుందుకు ప్రయత్నిస్తాను...." అన్నాడు.

10

"ఆ దరిద్రుణ్ని చూడాలని వచ్చాను" అన్నాడు వెంకన్న.

"ఇక్కడ చాలామంది దరిద్రులున్నారు. వాళ్ళలో ఏ దరిద్రుడో చెప్పు" అన్నాడు శంకర్రావు.

"చంద్రరాజు!" అన్నాడు వెంకన్న.

"వాడా....వాణ్నిప్పుడే బెయిల్ మీద విడిపించుకుని తీసుకెళ్ళారు!"

"చంద్రరాజుకు బెయిలా?" కోపంగా అన్నాడు వెంకన్న.

"నిన్నింత కోపంగా ఎప్పుడూ చూడలేదు. చంద్ర రాజు కేమిటి? అంతకంటె పెద్ద పెద్ద ఘోరాలు చేసిన వాళ్ళకే బెయిల్ ఇస్తున్నాం" అన్నాడు శంకర్రావు.

"చంద్రరాజు చేసిన ఘోరానికీ మిగతా ఘోరాలకీ పోలికుండదు. వాడి ఘోరాన్ని భగవంతుడు క్షమించినా నేను మాత్రం క్షమించలేను" అన్నాడు వెంకన్న.

"మరీ ఇంతలా ఆవేశ పడుతున్నావేమిటీ వేళ?" అన్నాడు శంకర్రావు ఆశ్చర్యంగా.

"నా బాధ నీ కర్థంకాదులే...." అని కళ్ళు తుడుచుకున్నాడు వెంకన్న "ఇంతకీ ఆ దరిద్రుణ్ని బెయిల్ మీద విడిపించి తీసుకెళ్ళిన నీచు డెవరు?"

"ఈ రోజు నీ నోటి దురుసు మరీ ఎక్కువగా వుంది. కాస్త జాగ్రత్తగా మాటలు వాడకపోతే నీ మీద ఎవరైనా పరువునష్టం దావా వేయగలరు. చంద్రరాజును విడిపించిన వాడు నీచుడుకాదు. అతను నీక్కూడా తెలుసు. అతని పేరు జనార్దనరావు. కావాలంటే అతడింటికి వెళ్ళి మిగతా వివరాలు తెలుసుకో" అన్నాడు ఇన్‌స్పెక్టర్ శంకర్రావు.

"జనార్దనరావా?" ఉలిక్కిపడ్డాడు వెంకన్న. అతడి ఆలోచనలు పరిపరివిధాల పోయాయి.

ఈ జనార్దనరావుకి నేరస్థులతో పని ఏమిటి? సురేష్ కుమార్ పైన అతనెందుకు పగబట్టాడు? అతనసల ఇంకా ఎలాంటి నేరాలు చేస్తున్నాడు?

"జనార్దనరావు అంతు చూడాలి. అతని కథ ఈ రోజుతో పూర్తిగా తేల్చేయాలి" అనుకున్నాడు వెంకన్న. అలా అనుకుని అతను టైం చూసుకున్నాడు. రాత్రి ఎనిమిదిన్నర అయింది.

ఇన్‌స్పెక్టర్ శంకర్రావు దగ్గర సెలవు తీసుకుని వెంకన్న కారులో తిన్నగా జనార్దనరావు యింటికి బయ ల్దేరాడు. అతడి కారు జనార్దనరావు బంగళా ముందు ఆగింది.

కారు ఆగగానే ప్రహరీ గేటు తెరుచుకుంది. గేటు తీసిన వ్యక్తి జనార్దనరావు!

జనార్దనరావు వెంకన్నవంక ఆశ్చర్యంగా చూసి "ఈ సమయంలో మీ రిక్కడకు వస్తారనుకోలేదు!" అన్నాడు. మనిషి కాస్త తడబాటు చూపిస్తున్నాడు.

"మీతో అర్జంటుగా మాట్లాడాలి. లోపలకు వెడదామా" అన్నాడు వెంకన్న కారు దిగి.

"ఇలా ఇక్కడ లాన్‌లో కూర్చుని మాట్లాడుకుందాం" అన్నాడు జనార్దనరావు.

ఇద్దరూ లాన్‌లో కూర్చున్నాక "చంద్రరాజుతో మీకు పనేమిటి?" అన్నా వెంకన్న.

"చంద్రరాజా.... వాడు మీకెలా తెలుసు?"

చంద్రరాజు పైన తనకెంత కసి పేరుకుపోయి వుందో వెంకన్న జనార్దనరావుకు చెప్పి "అలాంటివాణ్ని బెయిల్ మీద విడిపించిన మీపై నాకు సదభిప్రాయం లేదు" అన్నాడు.

జనార్దనరావు చటుక్కున లేచి నిలబడి "పదండి మీకు నేను చంద్రరాజును చూపిస్తాను" అన్నాడు. వెంకన్న లేచి నిలబడగానే "చంద్రరాజు కనబడగానే మీరేం చేయాలనుకుంటున్నారు?" అనడిగాడు.

"నోటితో చెప్పడమెందుకు? మీరే చూద్దురుగాని" అన్నాడు వెంకన్న.

వెంకన్న, జనార్దనరావు ఇంట్లోకి నడిచాడు. ఆ ఇల్లు, ఆ సమయం హఠాత్తుగా వెంకన్నకు ఏదో స్ఫురణకు

తెచ్చాయి. కొంపతీసి తను కూడా సురేష్‌కుమార్‌లాగే... ఈ ఇంట్లో ...కోరి చిక్కుల్ని ఆహ్వానించడంలేదు కదా! వెంకన్నకు ఒక్కసారి వళ్ళు జలదరించింది. అతను జనార్దనరావు వంక చూశాడు.

అతను తాపీగా అడుగులు వేస్తూ ఓ గదిని సమీపించి డోర్ వ్యూ మిర్రర్‌లోకి చూసి "మీరు కూడా చూడండి వెంకన్నగారూ!" అన్నాడు.

వెంకన్న కుతూహలంగా అందులోకి చూశాడు. అంతే....అతడికి నోట మాటరాలేదు....

సురేష్‌కుమార్ వర్ణించగా ఏమో అనుకున్నాడు కానీ ఆ వర్ణనలకు మించి భయంకరంగా వుంది కామినీపిశాచి. ఆమె ఓ యువకుణ్ని తరుముతోంది. అతడామె బాహు బంధాలనుంచి తప్పించుకోవడం కోసం గదిలో విఫల యత్నాలు చేస్తూ పరుగులు తీస్తున్నాడు.

"వాడే చంద్రరాజు!" అన్నాడు జనార్దనరావు తాపీగా.

"ఏమిటిది?" అన్నాడు వెంకన్న అతికష్టం మీద.

"గదిలో చంద్రరాజును వేటాడుతున్నది మనిషే కానీ పిశాచం కాదు. ఒకప్పుడు ఆమె కూడా అందరు ఆడవాళ్ళకులాగే అందంగా వుండేది. ఒక అగ్నిప్రమాదంలో ఆమె ఈ భయంకర రూపాన్ని సంపాదించుకుంది. ఈ రూపంతో ఎలా జీవించడమో అని వ్యధపడుతున్న ఆమెను నేను చేరదీసి ఆమె జీవితానికి ఓ అర్థం కల్పించాను. అదేమిటంటే...."అని జనార్దనరావు క్షణంఆగి—

"వెంకన్నగారూ! భగవంతుడు ఆడదాన్ని అబలగా సృష్టించాడు. కానీ ఆడదిలేని ఈ సృష్టికి ఉనికి ఎక్కడిది? అటువంటి ఆడదానిపై పశుబలంతో అత్యాచారం కావిం

చడంకన్న ఘోరముంటుందా? ఇష్టంలేని పురుషుణ్ని బల వంతంగా భరించవలసి వచ్చినందుకు జీవితమంటే వెగటు పుట్టి తన ప్రాణాలు తీసుకుంది రాధ. రాధ చావుకు కారకుడు సురేష్‌కుమార్.

నేను జరిగింది తెలిసి ఫరవాలేదని ధైర్యం చెప్పినా కూడా రాధ వినకుండా తన ప్రాణాలు తీసుకుంది. బల వంతంగా అనుభవించబడడంలో ఒక ఆడది పడే బాధ యెలాంటిదో మగాడిక్కూడా తెలియాలిగదా! అందుకే నేను ఆ గదిలో వున్న ఆడమనిషిని కామినీపిశాచిగా తయారుచేశాను. ఆమెను చేరబోయే పురుషుడు ముందు గానే శక్తిహీనుడయ్యే విధంగా భోజనంలో మత్తుపదా ర్థాలు కలిపిస్తున్నాను. ఆ శక్తిహీనుణ్ని నా కామినీపిశాచి బలవంతం చేస్తూంటే నేను చూసి ఆనందిస్తున్నాను. సురేష్ కుమార్‌ను వెంటాడి వేటాడి అతనికి ఆడపిల్లలంటే భయం పుట్టేలా చేశాను. అతను నా దగ్గరకు వచ్చాడు. కామినీపిశాచిని గురించిన నిజాన్ని మాత్రం నే నతనికి చెప్పలేదు. అతడూహించుకుని వుంటే వేరే సంగతి. కామినీపిశాని నా దగ్గరకు కూడా వచ్చిందనీ—నాకు ఆడ వాళ్ళంటే ప్రలోభం లేకపోవడంవల్ల అది నన్నేమీ చేయలేదనీ అతడికి చెప్పాను.

ఇప్పుడు చంద్రరాజు విషయంలోనూ అంతే! వాడు మీ పెద్దనాన్నగారి అమ్మాయిని బలవంతం చేశాడు. ఆమె ఆత్మహత్య చేసుకుంది. ఆ ఆవేదనలో వాణ్ని బాదాలని మీరుత్సుకతపడుతున్నారు. నాకు తెలుసు మీ రెంతగా తన్నితేమాత్రం — ఇష్టంలేని మగాడిచేత ఒక ఆడది బలవంతం చేయబడడంలో ఉండే బాధ ఎలా తెలుస్తుంది వాడికి? చంద్రరాజే కాదు....ఆడదానిపై

అత్యాచారం చేసిన ప్రతి మగవెధవపైన నేను ఆ కామినీ పిశాచిని వదిలిపెడతాను. అలాంటివాళ్ళ కోసం పరశురాముడిలా దేశమంతా గాలిస్తూనే వుంటాను" అన్నాడు.

ఈ కథ విని వెంకన్న అదిరిపోయాడు. అతడి ఆవేశం అణగారిపోయింది. అతను చటుక్కున జనార్ధనరావు చేతులు పట్టుకుని "నేను హింసను భరించలేను. దారుణంగా హత్యలు చేసిన వాళ్ళను కూడా ఏ మాత్రం వీలున్నా క్షమించి వదిలిపెట్టాలనే మన సత్వం నాది. అయినప్పటికీ కూడా నేను మిమ్మల్నీ, మీ శిక్షనూ అభినందిస్తున్నాను. మీరు చేసేది తప్పు కాదు. మీరు పరశురాములై సురేష్‌కుమార్, చంద్రరాజులాంటి వాళ్ళను వెతికి పట్టుకుని ఈ విధమైన వైద్యం చేయించి పంపండి. అదే మీరు మీ రాధకు చేయగలిగిన సేవ" అన్నాడు.

"వెంకన్నగారూ!" అన్నాడు జనార్ధనరావు ఆశ్చర్యంగా "మీరు నా ఈ చర్యను ఆమోదిస్తున్నారా?"

"తప్పకుండా!....ఇంతకాలం మీరు ప్రభ, దీప.... వగైరా అమ్మాయిల సాయం తీసుకుని మీ దీక్ష కొనసాగిస్తున్నారు. మీకు సాయపడడానికిప్పుడొక డిటెక్టివ్ కూడా వున్నాడు. చంద్రరాజు అనుభవిస్తున్న శిక్ష నా మనసును తేలిక చేసింది. వాడు చేసిన ఘోరం వాడికి అర్థం కావడానికింతకు మించిన ఉపాయంలేదు. ఎటొచ్చీ ఈ విషయానికి ప్రచారం కూడా వుంటే కానీ దుర్మార్గులలో భయం పుట్టదు. కామినీపిశాచి గురించి నలుగురికీ తెలిసేలా నేను చేయగలను. అలాగే నీ పేరు మరుగున వుండేలా చూడగలను...." అన్నాడు వెంకన్న.

వెంకన్న దృష్టిలో 'అసన' పత్రిక మెదుల్తోంది.

—:ఐపోయింది:—